1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | ఫిబ్రవరి 26, 2024 | www.navatelangana.com

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తాం : ఎమ్మెల్యే

నవతెలంగాణ-కడెం



రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని దిల్దార్‌నగర్‌లోని లక్ష్మీ నర్సింహా స్వామి జాతర, అదే విధంగా ధర్మాజీపేట్ గ్రామంలోని భీమన్న జాతరలో పాల్గొని, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష్మీ నర్సింహా స్వామి, భీమన్న ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. త్వరలో రోడ్డు, కరెంటు, నీటి, సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, నాయకులు తాళ్లపల్లి రమేష్, పడిగెల భూషణ్ పాల్గొన్నారు.

మీడియా అకాడమీ చైర్మెన్ నియామకంపై హర్షం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జర్నలిజం వృత్తిలో సుదీర్ఘ అనుభవం కలిగిన శ్రీనివాస్ రెడ్డికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సముచిత స్థానం కల్పించి గౌరవించడం శుభపరిణామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ హర్షం వ్యక్తం చేశారు. ఐజేయూ యూనియన్‌కు ప్రస్తుతం జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న శ్రీనివాస్ రెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించి తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మెన్‌గా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ చైర్మెన్‌గా చేసిన అనుభవాన్ని ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మెన్‌గా నియమించడం జరిగిందన్నారు. జర్నలిస్టుల కష్టాలను తెలిసిన నాయకుడిని చైర్మెన్‌గా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అనుమానస్పద స్థితిలో యువతి మృతి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

అనుమానస్పద స్థితిలో యువతి మృతిచెందిన సంఘటన గుండెపెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గుండెపెల్లి గ్రామానికి చెందిన తలండి నిర్మళ(26) అనే యువతి శుక్రవారం సాయంత్రం నుండి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు రెండు రోజులుగా యువతి కోసం గాలించారు. ఆదివారం కుటుంబసభ్యులు వెతుకుతుండగా ఒక చేను దగ్గరలో గాజులు, చెప్పులు, రక్తపు మరకలు కనిపించాయి. చుట్టుప్రక్కల వెతకగా పక్క చేనులో బావి వద్దకు వెళ్లి అనుమానంతో పోలీసులకు సమాచారం అందజేశారు. బావిలో యువతి శవం కనిపించి. విషయం తెలుసుకున్న కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను తెలుసుకున్నారు. యువతి తలకు రెండు బలమైన గాయాలను గుర్తించారు. మృతిచెందిన యువతికి రెండు సంవత్సరాల నుండి కోయపెల్లి గ్రామానికి చెందిన రవి అనే యువకుడితో ప్రేమలో ఉన్నట్టు, యువతి చనిపోవడానికి అదే కారణం అయి ఉండచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ యువతి తండ్రి తలండి నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నాగరాజు తెలిపారు. ఆయన వెంట పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ప్రశాంతంగా గురుకులాల రెండో విడత ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో నిర్వహించిన సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలలో రెండో విడత ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా సమన్వయకర్త, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు స్పెషల్ అబ్జర్వర్‌గా బోథ్ కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణలత వ్యవహరించి పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ పరీక్షకు బాలురు 173, బాలికలు 145, మొత్తం 318 విద్యార్థులకు గాను 301 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా 95 శాతం హాజరు నమోదైందని ఆమె తెలిపారు. ఈ పరీక్ష ద్వారా సాంఘిక సంక్షేమ ప్రతిభ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, గ్రూపులలో ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

మరో రెండు షురూ..!



గృహజ్యోతి, రూ. 500లకే గ్యాస్ సిలిండర్
రేపటి నుంచి అమలుకు ప్రభుత్వం శ్రీకారం
ఉమ్మడి జిల్లాలో లక్షల మందికి ప్రయోజనం



రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు పథకాలను అమలు చేసేందుకు ముహూర్తం ఖరారు చేసింది. మహాలక్ష్మీ పథకంలో రూ.500లకే గ్యాస్ సిలిండర్ పంపిణీతో పాటు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. మంగళవారం నుంచి వీటిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల్లో భాగంగా ఇప్పటికే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించడంతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10లక్షల ఇన్సురెన్సు సౌకర్యాన్ని ప్రారంభించింది. తాజాగా గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ పథకాలను ప్రారంభించడం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలిగించనుంది. ఈ పథకాల అమలుతో అర్హులైన పేదలకు ఆర్థిక భారం తప్పనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. కాంగ్రెస్ హామీని నమ్మిన ప్రజలు అధికారాన్ని కట్టబెట్టారు. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే రాష్ట్రంలో రెండు గ్యారెంటీలను అమలు చేసింది. ఆర్టీసీలో మహిళలకు పూర్తిగా ఉచిత ప్రయాణం కల్పించడంతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పిస్తోంది. మరో పథకాలను సైతం వంద రోజుల్లోపు అమలు చేస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆరు గ్యారెంటీల్లో భాగంగా రెండు పథకాలను ప్రారంభించాలని భావిస్తోంది. గృహజ్యోతి పథకంలో భాగంగా 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించేందుకు నిర్ణయించింది. ప్రభుత్వం నుంచి వచ్చిన నిబంధనల ప్రకారం రేషన్‌కార్డు ప్రతిపాధికన ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే లబ్దిదారుల నుంచి రేషన్, ఆధార్ కార్డు తదితర వాటిని సేకరించారు. ఎవరైతే 200యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తారో వారికి ఈ పథకం వర్తిస్తుందని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 6.97లక్షల మంది విద్యుత్ వినియోగదారులు ఉండగా.. ఇందులో మెజార్టీ లబ్దిదారులకు ఈ పథకం వర్తించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇది వరకు నెలనెలా విద్యుత్ బిల్లులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న అనేక మంది నిరుపేదలకు ఈ పథకం ఒక వరంలా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గ్యాస్ సబ్సిడీతో ప్రయోజనం..!

గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.వెయికి చేరువకావడంతో అనేక మంది నిరుపేదలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర సరకుల ధరలు పెరగడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న జనాలకు తాజాగా ప్రభుత్వ నిర్ణయం ఉపశమనం కలిగించనుంది. రూ.500లకే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేయడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 9.03లక్షల మందికి ప్రయోజనం కల్పించనుంది. ప్రస్తుతం ఒక్కో సిలిండర్ రూ.982 చొప్పున ధర ఉంది. ప్రభుత్వం రూ.500లకే సిలిండర్ అందించడంతో అనేక మంది నిరుపేదలకు లబ్ధి చేకూరనుంది. ఈ పథకం ప్రకారం లబ్దిదారులు రూ.500 చెల్లిస్తే ప్రభుత్వం నగదు బదిలీ రూపంలో రూ.482 వారి బ్యాంకు ఖాతాలో జమ చేయనుంది. ఈ పథకానికి కూడా ప్రభుత్వం రేషన్‌కార్డును ప్రతిపాధికన లబ్ధిదారులను పరిగణనలోకి తీసుకోనుంది. ఈ పథకాలు అమలు చేయడం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక మంది నిరుపేదలకు ఆర్థిక భారం పడకుండా కొంత మేర ఉపశమనం కల్పించనుంది. ప్రతి నెలా గ్యాస్‌కు రూ.వెయ్యికి వరకు చెల్లించాల్సి రావడంతో చిరుద్యోగులు, రోజువారీ కూలీలు తీవ్ర ఆర్థిక భారంతో సతమతమయ్యేవారు. తాజాగా ఈ పథకం అమలుతో వారికి ఆర్థిక భారం నుంచి ఉపశమనం లభించనుంది.

ఉమ్మడి జిల్లాలో గృహజ్యోతి, గ్యాస్ వినియోగదారుల వివరాలు

జిల్లా	గృహజ్యోతి(లక్షల్లో)	గ్యాస్ వినియోగదారులు(లక్షల్లో)
ఆదిలాబాద్	1.68	2.15
ఆసిఫాబాద్	1.13	1.42
నిర్మల్	1.91	2.87
మంచిర్యాల	2.25	2.86



గృహజ్యోతికి సర్వే నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది (ఫైల్)

ఆల్పాహారం పథకంపై నీలి నీడలు

• మళ్లీ కొనసాగించని కొత్త ప్రభుత్వం • నిరు పేద విద్యార్థులకు తీరని నష్టం

వారంతా సర్కార్ బడుల్లో చదివే నిరుపేద విద్యార్థులు. ఇంట్లో ఉదయం పూట వంట కాకపోవడంతో బడికి రావాలంటే ఖాళీ కడుపుతోనే రావాల్సిన పరిస్థితి. దీంతో అనేక మంది విద్యార్థులు మధ్యాహ్నం వరకు ఆకలి మంటలతో అలమటించాల్సి వస్తుంది. మరో పక్క పౌష్టికాహారం లభించక రక్తహీనత లాంటి సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుంది. ఈ సమస్యను గుర్తించి గత ప్రభుత్వం విద్యార్థులకు అల్పాహారం పథకాన్ని అమలు చేసింది. కొన్ని రోజుల పాటు నిర్విరమంగా సాగిన ఈ పథకం ఎన్నికలు రావడంతో అర్థాతరంగా నిలిచిపోయాయి. రాష్ట్రంలో పాత ప్రభుత్వం పడిపోయి కొత్త సర్కారు కొలువు దీరింది. దీంతో ఈ అల్పాహారం పథకం కొనసాగింపుపై దృష్టిసారించడం లేదు. ఫలితంగా అనేక మంది పేద విద్యార్థులు ఆకలి భాధలతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తాజాగా కొత్త ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించేలని విద్యార్థులు కోరుతున్నారు.



మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాల

నవతెలంగాణ-కెరమెరి

విద్యార్థుల హాజరు పెంచడం.. పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా పిల్లల్లో శారీరక ఎదుగుదల ఉండేలా చూడటం. తల్లిదండ్రులపై భారం తగ్గించడం వంటి ప్రధాన ఉద్దేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రారంభించింది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించడం పేద పిల్లలకు వరం లాంటిదే. గత ప్రభుత్వం పథకాన్ని ప్రారంభించింది. ఎన్నికలకు ముందు పూర్తిస్థాయి బడ్జెట్‌ను గత ప్రభుత్వం కేటాయించలేదు. సరైన మార్గదర్శకాలు లేవు. దీంతో ఎన్నికల అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం అమలు కావడం లేదు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మానవీయ కోణంతో ఆలోచించి విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేలా పథకాన్ని అమలుచేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం పూట అల్పాహారం కూడా అందించాలని గతేడాది అక్టోబర్ 6న గత బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాన్ని ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా 816 ప్రాథమిక, 104 ప్రాథమికోన్నత, 64 ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ పథకం ద్వారా లబ్ది చేకూరింది. జిల్లాలో 45,555 మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అల్పాహార పథకం ద్వారా విద్యార్థులకు ఉదయం పూట టిఫిన్ అందిస్తారు. వారంలో ఆరు రోజులు వివిధ రకాల అల్పాహారం అందించాలని మెనూను ప్రకటించింది. పథకం అమలును పర్యవేక్షించేందుకు పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, గ్రామాల్లో అదనపు కలెక్టర్లు బాధ్యతలు చూడాలని కూడా అప్పటి ప్రభుత్వం ఆదేశించింది.

సీఎం బ్రేక్‌ఫాస్ట్ మెనూ

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన ముఖ్యమంత్రి అల్పాహారం పథకంలో రోజువారీగా విద్యార్థులకు పెట్టాల్సిన మెనూ. సోమవారం ఇడ్లీ-సాంబర్ లేదంటే గోదుమ రవ్వ ఉప్మా-చట్నీ, మంగళవారం పూరీ ఆలుకుర్మా లేదా రవ్వతో టమాటాబాత్, సాంబారు, బుధవారం ఉప్మా, సాంబర్ లేదా బియ్యం రవ్వ కిచిడీ, చట్నీ, గురువారం చిరుధాన్యాల ఇడ్లీ సాంబారు లేదా పొంగల్, సాంబారు, శుక్రవారం ఉగ్గాని,అటుకులు, చిరుధాన్యాల ఇడ్లీ, చట్నీ లేదా గోదుమరవ్వ కిచిడీ, చట్నీ, శనివారం పొంగల్, సాంబారు లేదా వెజిటబుల్ పులావ్, రాయిత, ఆలుకుర్మా ఉన్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టిపట్టనున్నట్లు ఉన్నారు.

నిలిచిన అల్పాహారం..

గత ప్రభుత్వం ప్రకటించిన పథకాన్ని తాము ఎందుకు కొనసాగించాలా..? తామకు పేరు రాకపోతుంతోనని ఎమో కానీ అల్పాహారం నిలిచింది. కారణాలు ఏమైనా ప్రస్తుతం అల్పాహార పథకం ఆగింది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వేలాది మంది పేదల నోటికి ముద్ద అందించే అల్పాహార పథకాన్ని కొనసాగించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రభుత్వం అమలు చేసిన అల్పాహారం మాత్రం ఇవ్వట్లేదు.

ఉదయం వచ్చి.. పరీక్షలకు కుస్తీ

పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని, ఎక్కువ మంది విద్యార్థులు 10 జీపీఏతో ఉత్తీర్ణులు కావాలనే ఉద్దేశంతో అదనపు తరగతులు తీసుకుంటున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు స్కూల్లోనే ఉంటున్నారు. మధ్యాహ్న భోజనం తప్ప ఎలాంటి ఆహారం లేకపోవడంతో అర్ధాకలితోనే చదువుకుంటున్నారు. అల్పాహార పథకం అమలు చేస్తే విద్యార్థులందరితో పాటు అదనంగా రెండు గంటల పాటు స్కూల్లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులకు మేలు చేకూరనుంది. ఉదయం అల్పాహారం లేదా సాయంత్రం స్నాక్స్ ఇస్తే మరింత శ్రద్ధగా చదువుకుంటామని పలువురు విద్యార్థులు పేర్కొంటున్నారు.

నిధుల్లేక అల్పాహారం ఆగింది

అల్పాహార పథకం ద్వారా ఉదయం పూట స్కూల్ ప్రారంభానికి ముందే 8.45 గంటలకు విద్యార్థులకు అల్పాహారం అందించేది. పిల్లల హాజరు శాతం పెరగడం, తల్లిదండ్రులకు భారం తగ్గించడం కోసం పథకాన్ని పెట్టారు. నిధులు రాకపోవడంతో ప్రస్తుతం అల్పాహారం ఇవ్వడంలేదు. దీంతో పదవ తరగతి విద్యార్థులతో పాటు ఇతర తరగతి పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు(ఫైల్)

అల్పాహార పథకాన్ని కొనసాగించాలి

వడ్లూరి కార్తీక్, జడ్పీఎస్ఎస్, కెరమెరి



గత ప్రభుత్వం అల్పాహార పథకాన్ని అమలు చేయడంతో పేద విద్యార్థులకు ఎంతో మేలు జరిగింది. కేవలం నెలరోజుల పాటు మాత్రమే అల్పాహారం అందించారు. అల్పార పథకంతో పేద విద్యార్థులకు చాలా ఉపయోగకరం. ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టిహకారం అందించేలా అల్పార పథకాన్ని కొనసాగించాలి.

పౌష్టికాహారానికి దూరం

మనీష, 9వ తరగతి, కెరమెరి



అల్పాహార పథకం వల్ల విద్యార్థులకు ఉదయం పూట పోషక విలువలతో కూడిన అల్పాహారం తీసుకోవడం వల్ల తరగతి గదిలో అలసట ఉండదు. రోజంతా చురుగ్గా ఉండేందుకు దోహదపడుతుంది. తల్లిదండ్రులపై భారం కూడా తగ్గుతుంది. అల్పాహారం పెట్టడంతో విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుంది. అల్పార పథకం నిలిపివేయడంతో పేద విద్యార్థులు పౌష్టికాహారానికి దూరమయ్యారు.

నేడు కాంగ్రెస్‌లోకి అర్షద్ హుస్సేన్

నవతెలంగాణ-కాగజ్‌నగర్



బెజ్జూర్ సింగిల్ విండో మాజీ చైర్మెన్, బహుజన సమాజ్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అర్షద్ హుస్సేన్ నేడు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. 2021 వరకు బీఆర్ఎస్ పార్టీలో ఉన్న అర్షద్ హుస్సేన్ అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలిసి పనిచేశారు. అప్పట్లో కోనేరు కోనప్పతో ఏర్పడ్డ విభేధాల కారణంగా ఆ పార్టీని వీడారు. అదే ఏడాది బహుజన సమాజ్ పార్టీలో చేరారు. బీఎస్పీ అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను ఒప్పించి సిర్పూర్ నియోజకవర్గం నుండి పోటీ చేయించడంలో అర్షద్ కీలకపాత్ర పోషించారు. కోనేరు కోనప్ప ఓటమే తన లక్ష్యమంటూ ఎన్నికల్లో ప్రచారం చేశారు. ఆర్ఎస్పీకి సన్నిహితంగా ఉంటూ బీఎస్పీలో కీలకపాత్ర పోశించాడు. నియోజకవర్గంలో బీఎస్పీ ఓటమి అనంతరం కాంగ్రెస్ పార్టీతో సంప్రదింపులు జరుపగా కాంగ్రెస్‌లో చేరుతాడంటూ ప్రచారం జరిగింది. కానీ అది కార్యరూపం దాల్చలేదు. మూడు రోజుల క్రితం ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షితో పాటు దీనికి ముందు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కూడా ఢిల్లీలో ఆయన కలిశారు. నేడు హైదరాబాదులోని గాంధీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. ఈ విషయమై అర్షద్ హుస్సేన్‌ను సంప్రదించగా తాను కాంగ్రెస్‌లో చేరనున్న విషయం వాస్తవమేనని తెలిపారు. తనతో పాటూ కౌటాల మాజీ ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్టు తెలిపారు.

మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు హర్షనీయమం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయ, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న జీఓ 317పై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేయడం హర్షనీయమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జీఓ 317 ద్వారా అమలు జరిపిన ఉద్యోగుల విభజనలో ఏర్పడిన సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారాలను సిఫారసు చేయటం కోసం జీఓ 292 ద్వారా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ అధ్యక్షతన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయటాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం 2021లో ఏకపక్షంగా విడుదల చేసిన జీఓ 317 మార్గదర్శకాల కారణంగా పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారన్నారు. క్యాడర్‌లో జూనియర్ అయినందుకే స్వంత జిల్లాలను వదిలి పరాయి జిల్లాకు కెటాయించబడ్డారని, భార్యాభర్తలను వేర్వేరు జిల్లాలకు కేటాయించారన్నారు. పూర్వపు సర్వీసును వదులుకుని అంతర్ జిల్లా బదిలీ ద్వారా వచ్చిన భార్యా భర్తలు కూడా తిరిగి వేరు చేయబడ్డారని, నిబంధనల ప్రకారం భార్యాభర్తలను ఒకే జిల్లాకు బదిలీ చేయాల్సి ఉండగా 19 జిల్లాల్లో అనుమతించి 13 జిల్లాలను బ్లాక్ చేశారన్నారు. స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు, విడిపోయిన భార్యాభర్తలకు న్యాయం చేయాలని కోరుతూ రెండు సంవత్సరాలుగా తమ సంఘంతో పాటు యూఎస్పీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలను గత ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన ప్రస్తుత ముఖ్యమంత్రి దృష్టికి సమస్య తీసుకువెళ్లామని దీనిపై స్పందించి అధికారం చేపట్టి వంద రోజులు కాకముందే 317 పై సబ్ కమిటీ వేయడం సంతోషంగా ఉందన్నారు. వెంటనే నష్టపోయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఇందురావు, నాయకులు ఊషన్న, రమేష్, హేమంత్ సిండే పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | ఫిబ్రవరి 26, 2024 | www.navatelangana.com

అట్టహాసంగా ముగిసిన క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గత నెల రోజుల పాటు అంజనీపుత్ర ఎస్టేట్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు అట్టహాసంగా ముగిసాయి. ఈ పోటీల్లో బండలనాగపూర్ జట్టు విజేతగా నిలువగా రూ.50వేల నగదు, కప్ అందుకుంది. రన్నరప్ జట్టు రూ.30వేలు, మూడో స్థానంలో నిలిచిన బాలాపూర్ హనుమాన్ జట్టు రూ.20వేలు, నాలుగో స్థానం కైవసం చేసుకున్న చాందా(టి) జట్టు రూ.10వేల నగదును సంస్థ చైర్మెన్ గుర్రాల శ్రీధర్ చేతుల మీదుగా అందుకున్నాయి. ఈ సందర్భంగా గుర్రాల శ్రీధర్ మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలనే లక్ష్యంతో ఈ క్రికెట్ పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ గుర్రాల కిరణ్, డిప్యూటీ డైరెక్టర్లు ప్రసన్నకుమారి, సరోజ, చీఫ్ జనరల్ మేనేజర్లు కే.కృష్ణ, లింగన్న, జనరల్ మేనేజర్ శ్యాంసుందర్, పోటీల నిర్వాహకులు మహేష్ జనగం, రాసర్ల మహేష్, పాల్గొన్నారు.

క్రీడలతోనే ఐక్యత భావం

నవతెలంగాణ-భైంసా

క్రీడలతోనే యువతలో ఐక్యత భావం పెంపొందుతుందని భైంసా ఎంపీపీ రజాక్, బీజేపీ నియోజకవర్గ నాయకులు శివాజీ పటేల్ అన్నారు. మండలంలోని దేగాం గ్రామంలో అనసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు హాజరై వారు మాట్లాడారు. యువత అన్ని రంగాల్లో రాణించాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆధ్వర్యంలో టోర్నమెంట్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. విజేతగా నిలిచిన జట్టుకు ఎమ్మెల్యే తరపున రూ.30 వేల నగదును ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. అదేవిధంగా రన్నర్ ఆఫ్‌గా నిలిచిన జట్టుకు రూ.15వేలను అందజేశారు. విజేతగా భైంసాకు చెందిన మిలన్ నిలువగా, రన్నారఫ్‌గా దేగాం జట్టు నిలిచింది. కార్యక్రమంలో బాసర మండల నాయకులు విశ్వనాథ్ పటేల్, భైంసా మండల నాయకులు సుభాష్ పటేల్, చందర్ పటేల్, చంద్రకాంత్ పటేల్, ఎమ్మార్పీఎస్ నాయకులు నందకుమార్, తుకారాం పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వైద్యులేరి...!

- ముప్పై పడకల ఆస్పత్రిలో ఒకే వైద్యుడు
- ఆదివాసులకు అందని ద్రాక్షగా ప్రభుత్వ వైద్యం



నవతెలంగాణ-నార్నూర్

గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యం ఆదివాసులకు అందని ద్రాక్షగా మారింది. ప్రభుత్వం వైద్యరంగానికి కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తోంది. గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినా, వైద్యుల కొరత కొట్టుమిట్టాడుతోంది. దీంతో గిరిజనులకు పూర్తిస్థాయిలో వైద్యం అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీని ముప్పై పడకల ఆస్పత్రిగా మార్చారు. ఈ ఆస్పత్రిలో ఐదుగురు వైద్యులను నియమించాల్సి ఉండగా, ప్రస్తుతం ఒక్కరు మాత్రమే పనిచేస్తున్నారు. ఆయన కూడ డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. ఆస్పత్రిలో సరిపడ సిబ్బంది ఉన్నప్పటికీ, వివిధ విభాగాల వైద్యనిపుణులు ఉండాల్సి ఉండగా వారిని నియమించక పోవడంతో ఆ పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి. దీంతో ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యం అందక ఇతర ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లి లక్షల్లో డబ్బులు ఖర్చు చేస్తూ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రతి మూడు నెలలకొకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను లేవనెత్తినప్పటికి, ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల తీరుకు అద్దం పడుతోంది. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న వైద్యపోస్టులను భర్తీ చేసి గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని మండల వాసులు కోరుతున్నారు.

పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

వైద్యుడు రాంబాబు

ఆస్పత్రిలో ఉన్న వైద్యుల కొరత విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం, ఆస్పత్రిలో వైద్యుల కొరత తప్ప సిబ్బంది కొరత లేదు. వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నాం. గ్రామాల్లో వైద్య సిబ్బందితో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గర్భిణీ, బాలింతలకు, టీకాలు ముప్పై ఏండ్ల పైబడిన వారికి అసంక్రమిత వ్యాధుల పరీక్షకు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాం.

నిధులు కేటాయించాలని అర్ధనగ్న ప్రదర్శన

- 41వ రోజుకు రైల్వే సాధన కమిటీ దీక్షలు




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ప్రజల చిరకాల వాంఛ అయిన ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్‌కు మార్చి 3న కెబినేట్ సమావేశంలో చర్చించి ఆమోదం తెలిపి నిధులు కేటాయించాలని, రైల్వేలైన్ సాధన కమిటీ చైర్మెన్ సిర్ర దేవేందర్ అన్నారు. ఆర్ అండ్ బి ఎదుట చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 41వ రోజుకు చేరుకోగా అర్థనగ్న ప్రదర్శన చేసి కేంద్రం తీరును ఎండట్టారు. గత 40 రోజులుగా ఆర్మూర్ రైల్వేలైన్ కోసం రిలే దీక్షలు కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోడం లేదని ఆరోపించారు. ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ కాకుండా నాగుల పల్లి, పఠాన్ చెరు వరకు రైల్వేలైన్ మంజూరు చేశారన్నారు. దాని వల్ల ఆదిలాబాద్‌కు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. మార్చిన 3న కెబినేట్ సమావేశం ఉందని, అందులో దీనిపై చర్చించి, బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి పనులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు వెంకట్ నారాయణ, అఫ్సర్ ఖాన్, మెస్రం భాస్కర్, నరేందర్, నితీష్, దేవేందర్ పాల్గొన్నారు.

మహాపురుషుల ఆలోచనలు ఎల్లప్పుడూ మనతోనే

- రవిదాస్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహాపురుషులు మన మధ్య లేకున్నా వారి ఆలోచన ద్వారా ఎల్లప్పుడూ మనతోనే ఉంటాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం సంత్ రవిదాస్ జయంతి సందర్భంగా స్థానిక చిలుకూరి లక్ష్మీనగర్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక బలహీన వర్గానికి చెందిన వ్యక్తి తన ఆలోచనల ద్వారా సమాజాన్ని ఉత్తేజపరుస్తూ తన మాటల ద్వారా సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చిన మహా పురుషుడు సంత రవిదాస్ అని అన్నారు. నేడు అందరికీ విద్య, ఆధ్యాత్మికత ఆయన ద్వారా ఎంతో మందికి మార్గదర్శనాన్ని చేశాయని తెలిపారు. గత పాలకుల హయాంలో బడుగు బలహీనవర్గాల ప్రజలు కేవలం ఎన్నికల పావులుగా మాత్రమే ఉండిపోయారని అన్నారు. కానీ 2023లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు చైతన్యవంతులై ఆ పాలకులకు బుద్ధి చెప్పారన్నారు. కేంద్రం ఎన్నో పథకాలను సామాజిక అభివృద్ధి కొరకు బలహీన వర్గాల అభివృద్ధి కొరకు చేపట్టింది. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు దాదారావ్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రఘునాథ్ ఇట్కరే, గాయక్వాడ్ సంజయ్, సంతోష్ వింకరే, రాజు కదం, సందీప్ జంజల్కర్, బీజేపీ నాయకులు మహేందర్, జోగు రవి, పొచ్చన్న, ముకుంద్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలు సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- లబ్దిదారులకు గ్యాస్ సిలెండర్‌ల పంపిణీ
- ఎంపీ సోయం, ఎమ్మెల్యే పాయల్ శంకర్



గ్యాస్ సిలెండర్‌లను పంపిణీ చేస్తున్న ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే పాయల శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సోయం బాపురావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉజ్వల పథకం కింద మంజూరైన వంద మంది లబ్దిదారులకు గ్యాస్ సిలెండర్‌లను ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, వాటి గురించి తెలియక లబ్ది పొందలేక పోతున్నారన్నారు. వికసిత్ భారత్ పేరిట దాదాపు 45 రోజుల పాటు ప్రచార వాహనాల ద్వారా అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని కారణంగా ఎంతో మంది వాటిని వినియోగించుకోవడం లేదన్నారు. కట్టెల పొయ్యిపై వంటలు వండటం కారణంగా ఆరోగ్యం క్షీణిస్తుందని, పేదల ఆరోగ్యం కోసమే ఉజ్వల పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తన తల్లి పడ్డ కష్టాలు భారత దేశంలో ఏ ఒక్క మహిళ పడవద్దనే ఉద్యేశంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉజ్వల పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నారని అన్నారు. ఉచిత గ్యాస్‌కు పరిమితం కాకుండా ఇండ్లు లేని పేదలకు కూడా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇండ్లు నిర్మించే పథకం ఉందన్నారు. తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ పథకాన్ని ప్రజలకు చేరనివ్వకుండా ఆ నిధులను పక్కదారి పట్టించిందని ఆరోపించారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, ఎన్నికల అనంతరం పేదలను గుర్తించి ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జోగు రవి, వేదవ్యాస్, ధోని జ్యోతి, చిల్కూరి జ్యోతిరెడ్డి, స్వప్న, రేఖ, నందబాయి, సతీష్, ముకుంద్ పాల్గొన్నారు.

'రైతుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు'

- మాజీ మంత్రి జోగు రామన్న
- హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఉపేక్షిస్తే సహించేది లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రైతులకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అధికారంలో లేనప్పుడు కాంగ్రెస్ నాయకులు రైతుల పట్ల మాట్లాడిన వారు అధికారం రాగానే రైతులను పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యపు పాలనకు నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన కానుకగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలలు దాటుతున్న ఇప్పటివరకు దాని ఊసే లేదన్నారు. జిల్లాలో లక్ష 64 వేల 124 రైతులకు రైతుబంధు కింద రూ.286కోట్లు అవసరమైతే, ఇప్పటివరకు 94 వేల 741 మందికి రూ.97 కోట్ల 16వేలు మాత్రమే వేశారన్నారు. రైతు పండించిన సోయా 70 నుంచి 80 దాకా విక్రయించిన తర్వాత మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. శనగ, కంది పంటలు రైతుల చేతికి వచ్చిందని ఇప్పటి నుంచే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజులుగా ఏర్పాటు చేయని పక్షంలో రైతుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజ్జగిరి నారాయణ, కుమ్రం రాజు, వేణుగంటి ప్రకాష్, నాయకులు ఆనంద్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఆదివాసీ సాంప్రదాయాలను భావితరాలకు అందించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూ, భావితరాలకు అందించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం హీరాసుక జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన గోండి ధర్మగురు హీరాసుక జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. బస్టాండ్ ఎదుట హీరాసుక ఆలయంలో పూజలు చేశారు. ఆదివాసుల సంస్కృతికి అనుగుణంగా పూజలు చేస్తూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాంజీగోండ్, కుమ్రంభీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ దేశంలో ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో గొప్పవని తెలిపారు. వాటిని భావితరాలకు అందించేల కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా హీరాసుక జయంతిని అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హీరాసుక జయంతిని నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హీరాసుక జాగృతి నాయకులు సిడాం రాంకిషన్, మెస్రం కృష్ణ, గెడం జనార్దన్, గెడం మనోహర్, ఆదివాసీ పర్దాన్ సేవా సంఘం అధ్యక్షుడు దుర్వ నగేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-నిర్మల్

పట్టణంలోని బాగులవాడ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అల్లం భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా కొక్కుల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా జి.అరవింద్, కోశాధికారిగా పెంటు రవి, ఉప కోశాధికారిగా అయిట్ల జగదీష్, ఉపాధ్యక్షులుగా లక్ష్మీ నర్సయ్య, తిరుమలేష్, ముఖ్య కార్యనిర్వహణాధికారిగా మూట గణేష్, దశరథ్, సాంస్కృతిక కార్యదర్శిగా ఐట్ల ప్రవీణ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన బీరువా, ఇతర సామాగ్రి

నవతెలంగాణ-తాంసి

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని జామిడి గ్రామంలో శనివారం అర్ధ రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నగరాడే బుద్ధ ప్రసాద్ ఇంటిలో అకస్మాత్తుగా ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కావడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న మరో ఇంట్లో కుటుంబ సభ్యులు అందరూ పడుకొని ఉన్నారు. అర్ధ రాత్రి సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో చుట్టూ పక్కల ఉన్న వారు గమనించి, కేకలు వేయగా లేచి చూసే సరికి తన సొంత ఇల్లు మొత్తం పూర్తిగా కాలిపోయింది. బుద్ధ ప్రసాద్ బ్రతుకుదెరువు కోసం సౌత్ ఆఫ్రికాలో మిల్ట్ కంపెనీలో పనిచేశాడు. ప్రస్తుతం గ్రామంలోనే ఉంటున్నాడు. ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో ఇంట్లో ఉన్న వస్తువులు టీవీ, బెడ్స్, ఫర్నిచర్ మొదలైన వస్తువులతో పాటు బీరువాలో ఉన్న రూ 1లక్ష 22 వేల నగదు, బంగారం, విద్యార్హత కలిన సర్టిఫికేట్స్, ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్‌పోర్ట్, బ్యాంక్ పాస్‌బుక్, గ్యాస్‌బుక్, ఏటీఎం కార్డుతో పాటు బర్త్ సర్టిఫికెట్స్ కాలిపోయాయి. సూమారు రూ.5 లక్షల వరకు ఆస్థి నష్టం జరిగిందని తెలిపారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత



నవతెలంగాణ-నార్నూర్

ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని మాజీ జెడ్పీటీసీ రూపావతి న్యానోబా పుష్కర్, దళిత హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు జాదవ్ శేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని ఖంపూర్ గ్రామంలో నిర్వహించిన హనుమాన్ అఖండ హరినామ సప్తహా ముగింపు కార్యక్రమంలో భాగంగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సలాం ఆనంద్‌రావ్, ఎంపీటీసీ యత్మా బాయి దర్ము, గ్రామ పటేల్ సలాం కేశవ్, పెద్దలు తుకారాం మహారాజ్, గజానంద్, గోవింద్, తానాజీ గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో సీసీరోడ్డు నిర్మాణానికి ఆదివారం ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మండలంలోని ఆయా గ్రామాల్లో రూ.27 లక్షల నిధులతో నూతనంగా సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని అన్నారు. గ్రామాలాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాల గంగాధర్, మండల కోఆప్షన్ సభ్యుడు మాణిక్ రావ్, బీజేపీ మండల అధ్యక్షుడు అమోల్, నాయకులు బాలాజీ, అశోక్, గంగాధర్, రమేష్, సంతోష్, నాందేవ్, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

నవతెలంగాణ-సిరికొండ

సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ బాలగంగాధర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నూతనంగా వేస్తున్నటువంటి సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. సీసీ రోడ్లు వేసిన తర్వాత క్యూరింగ్ సరిగా చేయాలని అన్నారు. సరిపడా కంకర, సిమెంట్, ఇసుకను వాడాలని అన్నారు.

వేదం శ్రీనివాస్‌రెడ్డికి డాక్టరేట్



నవతెలంగాణ-భైంసా

భైంసా పట్టణానికి చెందిన వేదం విద్యాసంస్థల చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డికి ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. విద్యారంగం, సామాజిక సేవ, యునైటెడ్ నేషన్స్ అకాడమిక్ ఇంపాక్ట్ కార్యక్రమంలో అతని భాగస్వామ్యానికి గుర్తింపుగా ఈ అవార్డు ప్రధానం చేసింది. బెంగళూరులోని హిల్స్ హోటల్లో వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా తోటి మిత్రులు, పలువురు అభిమానులు, పాఠశాల తల్లిదండ్రులు శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2006-07లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, వారు చదువుకున్న చోటే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను పువ్వులతో, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థి విద్యార్థులు మాట్లాడుతూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరికి ఒకరు పలకరించుకున్నారు.

సమాజాన్ని కదిలించిన రవిదాస్ రచనలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మానవ హక్కుల సమానత్వంపై సంత్ రవిదాస్ నవలలు, రచనలు యావత్ సమాజాన్ని కదిలించాయని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదివారం సంత్ రవిదాస్ జయంతిని పురస్కరించుకొని చిలుకూరి లక్ష్మీనగర్‌లోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంత్ రవిదాస్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన సేవలను గుర్తు చేశారు. అంతకుముందు సంఘ సభ్యులు జోగు రామన్న శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆధ్యాత్మికతతో పాటు సమాజ ఔన్నత్యానికి ఆయన చూపించిన స్ఫూర్తి మరువలేనిదని కొనియాడారు.

బెల్లంపల్లి ఎమ్మెల్యేని కలిసిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ని హైదరాబాద్‌లోనీ ఆయన నివాసంలో ఆదివారం ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం పలు అంశాలపై వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఆయన వెంట సోదరుడు వేణు, కుమారుడు అనురాగ్ ఉన్నారు.

జాబ్‌మేళాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-వాంకిడి

జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయాలని ఎస్‌ఐ సాగర్ తెలిపారు. ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు మెగా జాబ్‌మేళా ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన యువతీ, యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ-కేవైసీ చేసుకోవాలి

నవతెలంగాణ-వాంకిడి

ఈ నెల 29వ తేదీతో ఈ-కేవైసీ గడువు ముగియనుండడంతో ఇప్పటివరకు రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈ-కేవైసీ చేసుకోని వారు పూర్తిచేసుకోవాలని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇప్పటికే రెండుసార్లు అవకాశం ఇవ్వడం జరిగిందని, ఈ-కేవైసీ చేయని వారు తప్పనిసరిగా రేషన్ షాపుల వద్ద చేసుకోవాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని పెంచికల్‌పేట్ గ్రామంలో ఉపాధిహామీ పథకం నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొయిరె బండు ఆదివారం ప్రారంభించారు. పనుల్లో నాణ్యత పాటించేల చూడాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎలుకరి లచ్చన్న, బొయిరె వాగయ్య, తాళ్ల లాంచు, పొట్ట లచ్చన్న, పుల్గం భాస్కర్, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, రౌతు తిరుపతి, రాజన్న పాల్గొన్నారు.

వార్షికోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని గుండె గ్రామంలో ఈనెల 27, 28 రెండు రోజుల పాటు నిర్వహించనున్న పులాజి బాబా ధ్యాన కేంద్రం 10వ వార్షికోత్సవ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మికి కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులాజీ బాబా ఆదర్శాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేసినప్పుడు సమాజంలో మంచి మార్పులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ జాబరి అరుణ, రవీందర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దాంపెల్లి శ్యామ్‌రావు, ప్యాక్స్ డైరెక్టర్ నారా ఆశన్న, వార్డు సభ్యులు రోజా, రాజు, అశోక్, కమిటీ సభ్యులు కాశినాథ్, శంకర్, పెంటు, రాందాస్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని గంగాపూర్ గ్రామంలో వెలిసిన శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారిని ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోవలక్ష్మి దంపతులు ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు గణేష్ శర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోవలక్ష్మి దంపతులకు, సిర్పూర్(యు) జెడ్పీటీసీ కోవ అరుణకు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయ విగ్రహ వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పెద్దవాగు ఆటోనగర్ అభయాంజనేయ స్వామి భారీ విగ్రహ 13వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు వార్షికోత్సవ కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలతో ప్రారంభమై ఉదయం 10:30కు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

శ్రీ ప్రసన్న పరమేశ్వర ఆలయం వేలం పాట

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని నంబాల గ్రామంలో గల శ్రీ ప్రసన్న పరమేశ్వర ఆలయం శివాలయం ఆవరణలో మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని ఈ నెల 27న ఉదయం 11 గంటలకు తైబజార్, సైకిల్ స్టాండ్, కొబ్బరికాయలు, ప్రసాదం కోసం వేలం పాట నిర్వహించనున్నారు. ఆసక్తి గల వారు ఈ వేలం పాటలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కౌటాల

విద్యుత్ సరఫరాలో సోమవారం అంతరాయం ఉంటుందని ఏఈ రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గురుడుపేట్, కన్నెపెల్లి, బోదంపెల్లి, కనికీ, యాపలగూడ గ్రామాలకు చెందిన సబ్‌స్టేషన్‌లోని ఫీడర్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11 కేవీ లైన్ మరమ్మత్తులు చేయడం జరుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అక్రమ వరిధాన్యం నిల్వలపై చర్యలేవి..?

- పెట్టుబడి దారుల కనుసైగల్లో ధరలు..

నవతెలంగాణ-సిర్పూర్(టి)



రైస్‌మిల్ గోదాంకు సీల్ వేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు(ఫైల్)

మండలంలోని అక్రమ వరిధాన్యం నిల్వలు పెరిగిపోతున్నాయి. బడా వ్యాపారులు, పెట్టుబడి దారులు రైతులకు అధిక వడ్డీతో రుణాలు ఇచ్చి వారి స్థానంలో వరి ధాన్యం అప్పులో జమ చేసుకుంటున్నారు. నిల్వల కారణంగా మార్కెట్‌లో వరి ధాన్యం రాక డిమాండ్ పెరుగుతుంది. కృత్రిక కొతరను సృష్టించేలా పెట్టుబడి దారులు కొత్త రకం మోసానికి పాల్పడుతున్నారు. ఇటీవల మండల కేంద్రంలో అధికారులు తనిఖీలు చేసి నిల్వలను గుర్తించారు. అయితే అధికారులు తూతూమంత్రంగానే చర్యలు తీసుకున్నారనే ఆరోపణలున్నాయి.

పెట్టుబడి దారుల కనుసైగల్లో ధరలు..

రైతులు తమ పంట సాగు చేసే సమయంలో వ్యాపారస్తులు, పెట్టుబడి దారుల నుండి అధిక వడ్డీ రేట్లకు అప్పులు చేసి పంటలు పండిస్తున్నారు. నాటి నుండి నేటి వరకు ఏ ప్రభుత్వం కూడా రైతుల పక్షాన నిలబడి గిట్టుబాటు ధర కల్పించలేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో కార్పొరేట్, బడా పెట్టుబడి దారుల కనుసైగల్లో ధరలు నిర్ణయించడం మన దేశంలో ఉన్న దౌర్భాగ్య స్థితి. రైతులు ఆరుగాలం శ్రమించి పసి పిల్లల్లాగా పంటలు కాపాడుకుంటున్నారు. అయితే ధరల విషయంలో అమ్ముకొనే సమయంలో ప్రభుత్వాలు వారికి సహకరించకపోవడం బాధాకరం. బడా పెట్టుబడి దారులకు, దళారులు, వ్యాపారస్తులకు కొమ్ముకాసే విధంగా ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.

రైస్ మిల్లుల్లో అక్రమ నిల్వలు

సిర్పూర్ మండలంలోని ఓ రైస్ మిల్లులో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ప్రభుత్వం కేటాయించిన వరిధాన్యాన్ని మాత్రమే రైస్ మిల్లులో నిల్వలు ఉంచాలి. కానీ రైస్ మిల్లుల యజమానులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిల్వలు ఉంచుతున్నారు. ఈ నెల 21న వేంపల్లిలోని లక్ష్మీనరసింహ రైస్‌మిల్లులో ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ తనిఖీలు చేశారు. రబీ సీజన్‌లో ప్రభుత్వం 38,260 వరిధాన్యం బస్తాలు కేటాయించగా దానిలో కేవలం 2174 వరిధాన్యం బస్తాలు మాత్రమే ఉన్నాయి. 3691 బస్తాలు తక్కువగా ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిల్వలు ఉండడం గమనార్హం. రైస్‌మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు ఎంతమేరకు అమలుచేస్తున్నారో తెలుస్తుంది. అలాగే 23న శ్రీసాయి బాలాజీ అగ్రోటెక్ రైస్‌మిల్లులో తనిఖీలు చేయడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ సిబ్బంది వెళ్లగా రైస్‌మిల్లుకు తాళాలు వేసి ఉండడంతో అధికారులు సంబంధిత మిల్లు యజమానికి ఫోన్ ద్వారా సంప్రదించగా రైస్‌మిల్లుకు వస్తున్నానని చెప్పి సమయానికి రాకపోవడం కాలయాపన చేయడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది మిల్లుకు సీల్ వేశారు. తిరిగి మరుసటి రోజు శనివారం వెళ్లినప్పటికీ కూడా రైస్‌మిల్లు యజమాని రాలేదు. దీంతో రైస్‌మిల్లులో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ నిల్వలు ఉన్నాయేమోనని, దానికోసమే మిల్లు యజమాని రాకపోవడంలేదని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లక్ష్మీనరసింహ రైస్‌మిల్లు అధికారులు తనిఖీ చేసిన వ్యత్యాసం, శ్రీసాయి బాలాజీ రైస్‌మిల్లు మూసివేయడంతో ప్రభుత్వ అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో రైతులు ఎదురుచూస్తున్నారు. ఒక మండలంలో ఈ విధంగా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైస్‌మిల్లులో ఎలా ఉంటుందో. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు వారి విధులు సక్రమంగా నిర్వహిస్తే ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నవతెలంగాణ విలేకరి మిల్లు యజమానిని ఈ విషయంపై వివరణ కోరగా రైస్‌మిల్లుకు 21 నుండి పలు జాతరలు ఉన్నందు వల్ల మా మిల్లు ఈ నెల 21 నుండి 26వ తేదీ వరకు మూసివేసినట్టు, తిరిగి సెలవుల అనంతరం అధికారులకు సహకరిస్తానని చెప్పడం కోసమెరుపు.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను శిక్షించాలి



ఆఆఆ

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం బోరంపల్లి గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి శిక్షించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లేండుగురే శ్యామ్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం కాగజ్‌నగర్-సిర్పూర్ ప్రధాన రహదారిపై కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రగతి భవన్‌కు మహాత్మా జ్యోతి రావు పూలే పేరు పెట్టడం కాదని, వారి ఆశయాలను అమలులోకి తెవాలన్నారు. విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ ప్రధాన కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా అధికార ప్రతినిధి నక్క మనోహర్, పట్టణ ఇన్‌చార్జి షబ్బీర్ హుస్సేన్, పట్టణ ఉపాధ్యక్షుడు తన్నీరు పోచం, ప్రధాన కార్యదర్శి సిద్ధం శ్రీను, రేణుకుంట్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పిల్లల తిరుపతి, మాలీ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి గౌత్రే గోపాల్, లేండుగురే గోపి, దాసరి నరేందర్, మెరుగు రాజేష్, వాసకే హనుమంతు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సలహాలే న్యాయవాది పరిషత్ లక్ష్యం

- రాష్ట్ర కోశాధికారి మంగులాల్ రాథోడ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆఆఆ

సమాజంలోని పేద ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు, న్యాయ సహకారం అందించడమే న్యాయవాది పరిషత్ లక్ష్యమని న్యాయవాది పరిషత్ రాష్ట్ర కోశాధికారి మంగులాల్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన జిల్లా న్యాయవాది పరిషత్ కమిటీ ఎన్నికలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నిక అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో పేద ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు అందించే లక్ష్యంతో అఖిల భారతీయ ఆదివాక్త పరిషత్‌లో భాగంగా రాష్ట్రంలో న్యాయవాది పరిషత్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఈ పరిషత్ అవసరం ఎంతో ఉంటుందన్నారు. అనేకమంది పేద ప్రజలు అనునిత్యం కోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తుందని, వారికి చేయూత అందించే దిశగా పరిషత్ పని చేస్తుందన్నారు. జిల్లాలోని ప్రజలు దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాబు, న్యాయవాదులు రాపర్తి రవీందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

న్యాయవాది పరిషత్ అధ్యక్షుడిగా రవీందర్ రెడ్డి

న్యాయవాది పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా రవీందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా లేకురే నాగేష్, కోశాధికారిగా లాల్‌శావ్, ఉపాధ్యక్షులుగా గాయత్రి, చరణ్ తేజ, సతీష్, సెక్రటరీలుగా కళ్యాణ్, ఆకాష్, గణేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సతీష్ బాబు, వెంకటేశ్వర్లు, రాపర్తి రవీందర్, చంద్రకుమార్, స్వప్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.

ముగిసిన బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాలు

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గంగాపూర్ గ్రామంలో వెలిసిన శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాలు సోమవారం స్వామి వారి కళ్యాణంతో ప్రారంభమై శనివారం రథసప్తమి, ఆదివారం స్వామి వారి మొక్కుబడులతో ముగిశాయి. మూడు రోజుల పాటు జిల్లాలోని భక్తులతో పాటు ప్రక్క జిల్లాల నుండి పెద్దఎత్తున తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం మూడో రోజు భక్తుల రద్దీ అంతగా లేనప్పటికీ జాతరలో వెలిసిన దుకాణాల వద్ద కొంత సందడి కనిపించింది. ముఖ్యంగా చివరిరోజు జాతరకు వచ్చిన భక్తులు ప్రసాదాలు, అలంకార సామాగ్రి కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు. వ్యాపారులు సైతం జాతర ముగింపు సందర్భంగా ధరలను తగ్గించి విక్రయించారు. జాతర సందర్భంగా భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నూతన ఆలయ కమిటీ చైర్మెన్ ఈఓ పర్యవేక్షించారు. స్థానిక ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.



హర్షం వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు



నవతెలంగాణ-కౌటాల

జీఓ నెంబర్ 317 సమస్యపై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేయడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో పలువురు ఉపాధ్యాయులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 317ను అధ్యాయనం చేయడానికి ఉప సంఘం ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోధర నరసింహ, గుగ్గిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభాకర్‌తో పాటు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. 317 జీఓ సమస్యను పరిష్కరించడం ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయడానికి ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి రుణపడి ఉంటామన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు, పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటినీ ప్రత్యేక చొరవ చూపించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. ఇందులో ఉపాధ్యాయులు ఆదె శివాజీ, నాయికిని శ్రీనివాస్, తాళ్లపెల్లి శ్రావన్, బండి శేఖర్, తిరుపతి, రౌతు సునీల్ ఉన్నారు.

జిల్లా కేంద్రంలో భారీ వర్షం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో ఆదివారం అరగంట పాటు భారీ వర్షం కురిసింది. రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఉదయం నుండి జిల్లావ్యాప్తంగా ఆకాశం మెగావృతమైంది. మధ్యాహ్నం పూట అరగంట పాటు భారీ వర్షం కురిసింది. మూడు రోజుల నుండి కొంత ఎండ వేడి పెరిగిన నేపథ్యంలో ఆదివారం కురిసిన వర్షంతో కొంత ఉపశమనం లభించింది. ఒకేసారి భారీ వర్షం కురవడంతో రోడ్డుపై వ్యాపారం చేసే తోపుడుబండ్లతో పాటు జిన్నింగ్ మిల్లులో యజమానులు ఇబ్బందులు పడ్డారు.

ఉచిత కంటి శిబిరాన్ని ప్రారంభించిన ఎస్సై



నవతెలంగాణ-బెజ్జూరు

మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఎస్సై విక్రమ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ స్వర్గీయ హనుమగౌడ్ బుచ్చమ్మ జ్ఞాపకార్థం మంచిర్యాల న్యూపవన్ ఆప్టిక్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కంటి సమస్యలున్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలకేంద్రంలో కొండ్ర హనుమగౌడ్, బుచ్చమ్మ జ్ఞాపకార్థం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, మాజీ ఎంపీపీ కొండ్ర మనోహర్‌గౌడ్, మాజీ సర్పంచ్ జగ్గాగౌడ్, సురేష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, కంటి ఆస్పత్రి వైద్యులు అభిషేక్, గోపికృష్ణ, నాయకులు జావిద్ అలీ, తాజుద్దీన్ పాల్గొన్నారు.

నేడు బారెగూడ రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభం

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని శివాపూర్ బారెగూడ దారిలోని రైల్వే ట్రాక్ కింద నిర్మించిన బారెగూడ రైల్వే అండర్ బ్రిడ్జిని సోమవారం దేశ ప్రధాని నరేంద్రమోడీ వర్చువల్‌లో ప్రారంభించనున్నారు. కాగజ్‌నగర్-రెబ్బెన రైల్వేస్టేషన్ల మధ్యలోని బారెగూడ రైల్వేగేటు వద్ద రూ.2.50 కోట్ల వ్యయంతో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం ఇటీవలే పూర్తి చేశారు. దేశంలో రైల్వే వ్యవస్థను ఆధునికీకరించాలనే ఉద్దేశంతో అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా రెండు వేల స్టేషన్ల పరిధిలోని 1,500 ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలకు నేడు ప్రధాని మోడీ శంకుస్థాపన చేయనున్నారు. దీనిలో భాగంగా బారెగూడ రైల్వే అండర్ బ్రిడ్జిని ప్రారంభించనున్నారు.

లారీ ఢీకొని ఇళ్లు ధ్వంసం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని అందవెల్లిలో శుక్రవారం అర్ధరాత్రి నీలగిరిలో లారీ అదుపు తప్పి ఓ ఇంటిని ఢీకొనడంతో ఇళ్ళు సగం భాగం ధ్వంసమైంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. అందవెల్లి గ్రామానికి చెందిన ఎం.సత్యయ్య కుటుంబ సభ్యులు ఆ ఇంటి ఓగదిలో నిదిస్తున్నారు. మంచిర్యాల జిల్లా భీమిని మండలం అక్కలపల్లి నుంచి నీలగిరిలోడ్‌తో లారీ కాగజ్‌నగర్ వైపు వెళ్తుంది. అందవెల్లిలో రోడ్డు కొంత ఎత్తు ప్రాంతం కావడంతో నీలగిరి లారీ ముందు వెళ్లడానికి సామార్థ్యం సరిపోనందున ఆ లారీ వెనుకవచ్చి సత్యయ్య ఇంటిని ఢీకొట్టింది. సత్యయ్య, కుటుంబ సభ్యులు మరోగదిలో నిద్రిస్తుండటంతో ప్రాణాపాయ ఘటన నుంచి బతికి బయటపడ్డారు. గదితో పాటు వస్తుసామాగ్రి ధ్వంసమైంది. శబ్ధం రావడంతో బాధిత కుటుంబంతో పాటు ఇరుగు పొరుగు నిద్రనుంచి మేల్కొని ఘటన స్థలంలోనే లారీని నిలిపివేశారు. అప్పటికే లారీ డ్రైవర్ పారిపోయాడు. ఈ విషయంపై బాధితుడు తమకు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని ఈజ్‌గాం పోలీసులు తెలిపారు.



మండల ప్రీమియర్ లీగ్ ప్రారంభం

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలోని ముత్యంపల్లి క్రీడా మైదానంలో ఆదివారం కాసిపేట మండల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ముందుగా జాతీయ గీతాలాపన చేసి మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి మ్యాచ్‌ను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గొంది వెంకటరమణ ప్రారంభించారు. మొత్తం 10 జట్లు పాల్గొనుండగా 90 మ్యాచ్లు 26 రోజుల పాటు టోర్నీ సాగనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేఎంపీఎల్ నిర్వాహకులు దాసరి శంకర్, మేరుగు శ్రీనివాస్, నాంసాని రాజు, కమటం తిరుపతి, క్రీడాకారులు విక్రంరావు, బోయిని తిరుపతి యాదవ్, నస్పూరి నర్సింగ్, రత్నం ప్రదీప్, మైదం రమేశ్, జాడి శివ, బలరాం, సందీప్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ కృషితో కార్మికులకు ఎక్స్‌గ్రేషియ

నవతెలంగాణ-కాసిపేట

ఏఐటీయూసీ కృషి ఫలితంగా సింగరేణి కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.కోటి ఎక్స్‌గ్రేషియ చెల్లించేందుకు యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియా(యూబీఐ) ఒప్పుకున్నట్లు ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య బ్యాంకు అధికారులతో మాట్లాడి ఒప్పించడం జరిగిందని, 26న బ్యాంకు అధికారులు ముఖ్యమంత్రి ఎదుట యాజమాన్యంతో ఒప్పందం చేసుకోనున్నట్లు తెలిపారు. ఇతర బ్యాంకులు సైతం అదేవిధంగా చెల్లించాలని లేనిపక్షంలో కార్మికుల ఖాతాలు బదిలీ చేసుకోవడం జరుగుతుందన్నారు. సింగరేణి కార్మికులు ఏఐటీయూసీ చేసిన కృషిని గమనించాలని బ్రాంచి ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, బ్రాంచి సహాయ కార్యదర్శి దాసరి తిరుపతి, నాగేశ్వరరావు, మీనుగు లక్ష్మినారాయణ, గోల్ల శ్రీనివాస్, శ్రీధర్, రవీందర్లు కోరారు.

కాంగ్రెస్ సారంగపల్లి గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మందమర్రి

కాంగ్రెస్ సారంగపల్లి గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. సారంగపల్లి గ్రామంలో మండల అధ్యక్షుడు నీలయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ సారంగపల్లి గ్రామ కమిటీని ప్రకటించారు. అధ్యక్షునిగా ఎండీ అబ్బును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పెద్దపల్లి చంద్రకళ, యాదగిరి మల్లేష్, అంబిలపు రమేష్, ప్రధాన కార్యదర్శి రాయమల్లు, గౌరవ అధ్యక్షులు కమల, మనోహర్, సహాయ కార్యదర్శి లక్ష్మి, కోసహాయ కార్యదర్శి తాజుద్దీన్, కార్యదర్శి రమేష్, కోశాధికారిగా సత్యనారాయణ, సలహాదారులు అసెంపల్లి రాజయ్య కార్యవర్గ సభ్యులు మొఖీద్, లింగయ్య, కుమార్‌లను నియమించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంక్షలు ఎత్తివేయాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-జన్నారం

మండలం గుండా అటవి శాఖ అధికారులు భారీ వాహనాల రాకపోకలపై విధించిన నిషేదాన్ని ఎత్తివేయాలని కోరుతూ ఆదివారం మండల వాసులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా, ఎమ్మెల్యే ఈ విషయాన్ని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి కి తీసుకెళ్లి ఆంక్షలు ఎత్తివేసేలా చర్యలు తీసుకునెల చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరశరామ్, అక్బర్, వెంకటేశ్వర్‌రావు, భూక్యా రాజేష్ నాయక్, చంద్రశేఖర్ నాయక్, కొండపల్లి మహేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-వేమనపల్లి

మండలం పరిధిలోని నీల్వాయి గ్రామపంచాయతీలోని ఎస్సి కాలనీకి ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక ఎంపీటీసీ రుద్రబట్ల సంతోష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఎస్సీ కాలనికి రూ. 5 లక్షలు, బెస్తవాడకు రూ.15 లక్షలు నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు. మండల అభివృద్ధికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి కట్టుబడి ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ, మాజీ సర్పంచులు గాలి మధు, తిరుపతిరెడ్డి, మోర్ల రమేష్, బొద్దున శంకర్, ఆవులమారి దుర్గక్క, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న పాల్గొన్నారు.

బాధిత కుంటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-వేమనపల్లి



మండలంలోని క్యాతనపల్లి గ్రామానికి చెందిన టకిరె పున్నం అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న నీల్వాయి ఎంపీటీసి రుద్రభట్ల సంతోష్ కుమార్ ఆదివారం ఆయన కుంటుంబాన్ని పరామర్శించారు. వారి కుంటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వారివెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ, నీల్వాయి మాజీ సర్పంచులు వి.తిరుపతి రెడ్డి, గాలి మధు, కేతనపల్లి మాజీ సర్పంచులు బొద్దున శంకర్, ఆవులమారి దుర్గక్క, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న పాల్గొన్నారు.

వైభవంగా గాంధారి ఖిల్లా మైసమ్మ జాతర

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణ పరిధిలోని బొక్కలగుట్ట గ్రామపంచాయతీ సమీపంలోగల గాంధారి మైసమ్మ జాతర చివరోజు ఆదివారం ఆదివాసీ నాయక్ పోడ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. జాతరలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మైసమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చివరిరోజు అయిన దర్బార్‌లో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వచ్చే గాంధారి ఖిల్లా జాతర లోపు విద్యుత్, తాగునీటి సదుపాయం, రోడ్లు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీఇచ్చారు. అనంతరం గాంధారి మైసమ్మను దర్శించుకున్నారు. అలాగే బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయక్ పోడ్ నాయకులు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ కవిత, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళి కృష్ణ క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ జంగం కళ, సాగర్ రెడ్డి పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్యా యత్నం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్యా యత్నం చేసుకున్న సంఘటన మండలంలోని డోంగర్‌గావ్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కుడ్మేత దినేష్(23) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన గ్రామస్తులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా భీమన్న పండుగ

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో భీమన్న పండుగను ఆదివారం ఆదివాసీ నాయకపోడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య యత్నం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య యత్నం చేసుకున్న సంఘటన మండలంలోని హర్కపూర్ కోలాం గూడలో ఆదివారం చోటు చేసుకుంది. కొలాంగూడకు చెందిన ఆత్రం విశ్వనాథ్(25) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో చిన్న గొడవ జరగడంతో తన వ్యవసాయ చేనులో పురుగులమందు తాగాడు. ఇది గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని పైలట్ అశోక్ తెలిపారు.

ఉపాధ్యాయుల పదోన్నతుల సంక్షోభాన్ని నివారించాలి

నవతెలంగాణ-హాజీపూర్



ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించటం ద్వారా కోర్టు కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపడం ద్వారా ఉపాధ్యాయుల పదోన్నతుల్లో నెలకొన్న సంక్షోభాన్ని నివారించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు ఏ.వెంకట్, వి. శాంతకుమారి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో చార్వాక హాస్పిటల్ హాల్‌లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గోల్ల రామన్న అధ్యక్షతన మంచిర్యాల జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శులు ఏ. వెంకట్, వి. శాంతకుమారిలు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు కరువు భత్యాలు(డీఏ) మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు నష్టదాయకమైన సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం హామీ మేరకు వెంటనే రద్దు చేయాలన్నారు. 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని, సమగ్ర శిక్ష, కేజీబీవీ, యూఆర్ఎస్, గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ, మైనారిటీ, బీసీ వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, గెస్ట్ తదితర సిబ్బందికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తూ రెగ్యులరైజ్ చేయాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం కోసం మెగా డీఎస్సీ నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు సిబ్బందిని నియమించాలన్నారు. మండల కేంద్రల్లో ప్రస్తుతం ఉన్న ఉన్నత పాఠశాలలనే "తెలంగాణ పబ్లిక్ స్కూల్స్"గా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామన్న, గుర్రాల రాజావేణు మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగియబోతున్నందున ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. గురుకులాల్లో కేర్ టేకర్‌లను నియమించాలని, కేజీబీవీ సమగ్ర శిక్ష ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు జి. చక్రపాణి, లావణ్య, జిల్లా కోశాధికారి కిరణ్, జిల్లా కార్యదర్శులు జి. నర్సయ్య, కే. చంద్రమౌళి, ఏ. సంతోష్ కుమార్, వి. కిరణ్ కుమార్, బబితా, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ సమస్యలపై అధికారుల దృష్టి

- పింఛన్ పెంచాలని కార్మిక సంఘాల డిమాండ్



నవతెలంగాణ-జైపూర్

180వ కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(సీఎంపీఎఫ్) బోర్డ్ ఆఫ్ ట్రస్టీ సమావేశంలో సమస్యలపై చర్చ సాగింది. న్యూఢిల్లీలో ఈ నెల 22న ఏర్పాటైన సమావేశంలో వడ్డీ రేటు పెంపు సిఫారస్ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ 7.6 శాతం వడ్డీ రేటు ఇవ్వాలని సీఎంపీఎఫ్ బోర్డు ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరింది. బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఎంపీఎఫ్ ట్రస్టీ బోర్డ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ముందుగా 7.5 శాతం వడ్డీ రేటు ప్రతిపాదనను సీఎంపీఎఫ్ఓ బోర్డుకు తీసుకురాగా బోర్డులో విస్తృత పరిశీలన తర్వాత 7.6 శాతం సిఫారస్ చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో కూడా వడ్డీ రేటు 7.6 శాతం మాత్రమే. కాగా సీఎంపీఎఫ్ ఆర్గనేజేషన్‌లో పెన్షన్ పెంపును అధ్యయనం చేసిన తర్వాత యాక్చురీ నివేదిక రూ.45 వేల కోట్ల నష్టం కలిగిందని పేర్కొంది. పెన్షన్ పెంపు ఫండ్‌ను ఎలా మెరుగుపర్చుకోవాలో నిర్ణయించడానికి అదనపు బొగ్గు శాఖ కార్యదర్శి రూపెందర్ బ్రార్ అధ్యక్షతన ఒక కమిటీ నివేదికను సమర్పించనుంది. కాగా పెన్షన్ ఫండ్‌లో కోల్ ఇండియాకు టన్ను బొగ్గుకు రూ. 20 ఇవ్వడంపై కూడా సమావేశం చర్చించారు. సీఎంపీఎఫ్ చట్టం పథకం తిరిగి రూపొందించబడనుంది. ఇందు కోసం ఒక కమిటీ కూడా ఏర్పాటు చేశారు. పింఛన్ పెంచాలని కార్మిక సంఘాలు ఈ సంధర్భంగా డిమాండ్ చేశాయి. బోర్డు సమావేశంలో కోల్ సెక్రెటరీ, కోల్ ఇండియా చైర్మెన్, సీఎంపీఎఫ్ కమీషనర్, అనుబంధ కంపెనీల చైర్మెన్లు, ఎండీలు, డైరెక్టర్లు(పర్సనల్) యూనియన్‌ల నుంచి రామేంద్ర కుమార్, రాకేష్ కుమార్, లక్ష్మారెడ్డి, డీడీ రామానందన్ పాల్గొన్నారు.

సంఘం బలోతానికి కృషి చేయాలి

నవతెలంగాణ-దండేపల్లి



మున్నూరు కాపు సంఘం బలోపేతానికి ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగులు, ప్రతి ఒక్క సభ్యుడు కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాబు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల లక్ష్మీ నారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం గండేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ మున్నూరు కాపు ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. సంఘం బలోపేతానికి పాటుపడుతూ సమాజ సేవకు ముందు ఉండాలన్నారు. మున్నూరు కాపు సంఘం బలోపేతానికి కృషి చేస్తూనే ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూతనందించడం బాధ్యత అని తెలిపారు. మున్నూరు కాపులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడినప్పటికీ సామాజిక సేవ చేయడంలో ముందున్నట్లు పేర్కొన్నారు. సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరుతూ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విశ్రాంత ఉద్యోగుల మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా అన్నం సత్యనారాయణ అధ్యక్షులు రాజన్న, ఉపాధ్యక్షులుగా అప్పల మనోహర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా కుంచే కిషన్, సలహాదారులుగా సుగుణాకర్, శేఖర్ సభ్యులుగా రవి, గణేష్ లను ఎన్నుకున్నారు.

ఒలంపియాడ్ పరీక్షలో విద్యార్ధుల ప్రతిభ



నవతెలంగాణ-జన్నారం

2023-24 సంవత్సరానికి గాను రాష్ట్రవ్యాప్తంగా శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీనివాస రామానుజన్ మ్యాథ్స్ ఒలంపియాడ్ ఎగ్జామ్ నందు మండల కేంద్రంలోని స్లేట్‌హై స్కూల్‌కు చెందిన 14 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంక్‌లు సాధించారు. ఈ నెల 19వ తేదీన హైదరాబాద్ రవీంద్ర భారతి ఆడిటోరియం నందు లోకసత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, బహుమతులు అందుకున్నారు. స్లేట్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న పురం శెట్టి సహస్ర, ఆరవ తరగతికి చెందిన కొమురవేల్లి భరత్ చంద్రలు స్టేట్ సెకండ్ ర్యాంకు, గుండ రిత్విక్ స్టేట్ ఆరవ ర్యాంకు సాధించారు. అలాగే జిల్లా స్థాయిలో పి కృష్ణ తేజ, ముల్కల్ల ప్రణవి, అభినవ్ నాయక్, ఎండి రయానుద్దీన్. ఐశ్వర్య , మిగతా ఆరుగురు విద్యార్థులు జిల్లాస్థాయి కన్సోలేషన్ బహుమతులు సాధించినట్లు స్లేట్ హై స్కూల్ కరస్పాండెంట్ ఏనుగుశ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయి, జిల్లాస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

బాదిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-జైపూర్



చెన్నూర్ మండలం ఆస్నాద్ రోడ్డు కత్తెరశాల సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలిసి స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక వెంకటస్వామి పరామార్శించారు. ఈ ప్రమాదంలో ఆస్నాద్ మండలం ఓత్కులపల్లి గ్రామానికి చెందిన దేవేందర్, చెన్నూర్ పట్టణం లైన్‌గడ్డకు చెందిన సైఫ్ మరణించగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడటం బాధాకరమని పేర్కొన్నారు. ఈ సంధర్భంగా కాంగ్రెస్ నాయకులు మూల రాజిరెడ్డి, పయాజ్, బాపాగౌడ్, గజ్జల అంకాగౌడ్, చల్ల రాంరెడ్డి, మహేష్, తివారీ, రాజమల్లు గౌడ్, సుశీల్, శ్రీధర్, శ్రీనివాస్ ఎమ్మెల్యేతో కలిసి మృతుల పార్థివ దేహాల వద్ద నివాళులర్పించారు.

కోరిన కోరికలు తీర్చే తల్లి గాంధారి మైసమ్మ

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-మందమర్రి

కోరిన కోరికలు తీర్చే చల్లని తల్లి గాంధారి మైసమ్మ అని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మండలంలోని బొక్కలగుట్ట గ్రామంలో కొనసాగుతున్న గాంధారి మైసమ్మ జాతరకు ఆదివారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ఆదివాసీ నాయకపోడు సంఘ నాయకులు మాట్లాడుతూ గాంధారి మైసమ్మ మహిమ వల్ల దేవతని ఆదివాసులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ జాతరను జరుపుకుంటారన్నారు. కోరిన కోరికలు తీర్చే తల్లి గాంధారి మైసమ్మ అని గుట్ట నడుమ ఎంతో ఆహ్లాదకరమైన ప్రదేశంలో ప్రాచీన కాలం నుండి జాతర జరుగుతుందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎంతో కాలంగా ఇక్కడ విద్యుత్, నీటి సమస్యలున్నాయని, వసతులు కల్పించి సమస్యలన్నీ పరిష్కరిస్తామని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఆదివాసీ రాష్ట్ర జిల్లా సంఘం నాయకులు, తహసీల్దార్, వైద్య అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మందమర్రి మండల ఇన్‌చార్జి కడారి జీవన్ కుమార్, వడ్నాల శ్రీనివాస్, సొతుకు సుదర్శన్, గోపతి రాజయ్య పల్లె రాజు, సందీప్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా అర్జున్

నవతెలంగాణ-మందమర్రి

తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా మహంత్ అర్జున్ కుమార్‌ని నియమితులయ్యారు. మందమర్రికి చెందిన మాజీ ఎన్ఎస్‌యూఐ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మహంత్ అర్జున్ కుమార్‌ని యూత్ కాంగ్రెస్ స్టేట్ సెక్రటరీగా నియమిస్తున్నట్లు తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి ఆదివారం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ తనకు పదవీ ఇచ్చినందుకు సంతోషంగా ఉందని, ఈ అవకాశం ఇచ్చిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. యువతను ప్రోత్సహించడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని యువత రాజకీయాల్లోకి వచ్చి సమాజ అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

వైభవంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు

నవతెలంగాణ-నిర్మల్

సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలో శ్రీ పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయం నుంచి అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ప్రతిష్టించి బాజా భజంత్రీల నడుమ ఊరేగింపు జరిపారు. మహిళలు మంగళ హారతులతో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా సోమవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఉంటుందని ముదిరాజ్ కులస్తులు తెలిపారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు.

వైభవంగా పెద్దమ్మ తల్లి కళ్యాణ జాతర మహోత్సవం

నవతెలంగాణ-పెంబి

మండలంలోని మందపల్లిలో శ్రీ పెద్దమ్మ తల్లి కళ్యాణ, జాతర మహోత్సవం వేడుకలను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ జాతర సందర్భంగా అగ్ని గుండాల నిర్వహణ, శ్రీ పెద్దమ్మ తల్లి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి పెంబి మండలమే కాకుండా ఖానాపూర్, కడెం, మామడ అలాగే వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భక్తులు, వారి వారి మొక్కులైన కేశ ఖండన, తులా బారాలను మొక్కలను చెల్లించుకున్నారు. దాతలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారులు అర్జన్న, విష్ణు, భోజన్న, ముదిరాజ్ యువ సైన్యం సభ్యులు, అలాగే ముదిరాజ్ సంఘం పెద్దలు ఉన్నారు.

కండ్లకు గంతలు కట్టుకొని ఇద్దరి మేజిషియన్‌ల బైక్ యాత్ర

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హిందువుల 500 ఏండ్ల కళ అయోధ్య రామమందిర నిర్మాణాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేరవేర్చారని, రామున్ని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్తున్నారని ఎంపీ సోయం బాపురావు అన్నారు. సాహసోపేతంగా ఇద్దరు మేజిషియన్‌లు కండ్లకు గంతలు కట్టుకొని అయోధ్యకు వెళ్లడం అభినందనీయమని అన్నారు. ఈనెల 23న ముచ్చింతల్ నుంచి ఇద్దరు మేజిషియన్‌లు మురళి జోషి, రామకృష్ణలు అయోధ్యకు కండ్లకు గంతలు కట్టుకొని తమ బైక్ యాత్రను ప్రారంభించారు. ఆదివారం వీరి యాత్ర ఆదిలాబాద్‌కు చేరుకోగా గోపాలకృష్ణ మఠంలో పీఠాధిపతి యోగానంద సరస్వతితో కలిసి ఎంపీ స్వాగతం పలికారు. అనంతరం వారిని సత్కరించారు. ఈ సందర్భంగా వారి వాహనాలకు పూజలు చేసి యాత్ర ప్రశాంతంగా సాగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ సాహసోపేతంగా ఇద్దరు మేజిషియన్‌లు రామ మందిర దర్శనానికి అయోధ్యకు బైక్ యాత్ర చేపట్టడం వారి భక్తికి నిదర్శమని అన్నారు. విమానం, బైక్, కారు, పాదయాత్రగా కాకుండా సాహసోపేతంగా కండ్లకు గంతలకు కట్టుకొని బైక్ ప్రయాణం అంటే మాములు విషయం కాదన్నారు. దైవ భక్తి ఉన్న వారికే ఇది సాధ్యమవుతుందన్నారు. వీరి యాత్ర ప్రశంతంగా విజయవంతంగా సాగాలని దేవున్ని ప్రార్థిస్తున్నామన్నారు. 500 ఏండ్ల కళ నేరవేరిన వేళ ఎదో వినూత్నంగా చేయాలనే ఆలోచనతో తన మిత్రుడు రామకృష్ణతో కలిసి కండ్లకు గంతలు కట్టుకొని బైక్ యాత్రను చేపట్టామని మురళి జోషి తెలిపారు. సాధర ప్రజల కంటే వినూత్నంగా మేజిషియన్‌లు అయిన తాము ఇలా యాత్ర చేపట్టామన్నారు. రోజుకు రెండు వందల కిలోమీటర్ల వరకు ప్రయాణం సాగిస్తున్నామని తెలిపారు.

అఖిల భారత విద్యార్థుల సదస్సులో జేఏసీ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన అఖిల భారత విద్యార్థుల సదస్సులో ఆదిలాబాద్ జిల్లా విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ రాహుల్ నేతృత్వంలో పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానాన్ని ఎన్‌ఈపీ 2020ను రద్దు చేయాలని, ఉమ్మడి శాస్త్ర విద్యా విధానం అమలు చేయాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఉన్న బోధన బోధనేతర ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేయాలని, విద్యాలయాల అన్నింటిలో లింగ సామాజిక న్యాయం చేయాలన్నారు. ఈ సదస్సులో నాయకులు అనసూయ, మమత, నవీన్ కుమార్, సుజయ్, సత్యనారాయణ, సాయికుమార్, ఇఫ్తార్ ఖాన్, అశోక్ పాల్గొన్నారు.